ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

ఆదివారం 21 జనవరి 2024

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి - 8లో..

కార్మికుల సమస్యలను
పరిష్కరించాలి - 8లో..

# లెక్క తేలింది

## ఆరు గ్యారెంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

- జిల్లాలో 1,92,617 దరఖాస్తులు
- అమలుకు మిగిలింది 56 రోజులే
- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- పోటాపోటీగా దరఖాస్తులు



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి (ఫైల్)



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అభయ హస్తం పేరిట ప్రభుత్వం స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తుల లెక్క తేలింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు 255 గ్రామ పంచాయతీలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోని 67 వార్డుల్లో సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల్లో ప్రతి పథకానికి పోటీపడి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 1,92,617 దరఖాస్తులు వచ్చాయి. అధికార యంత్రాంగం ఆన్‌లైన్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు పథకాలు అమల్లోకి తెస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటికి 44 రోజులు గడిచిపోయాయి. హామీకి 56 రోజులే మిగిలి ఉండడంతో దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరిని అర్హులుగా గుర్తిస్తారనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికే ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. మిగతా పథకాలు అమల్లోకి ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

**● గ్యాస్ సిలిండర్ ఫస్ట్.. కరెంట్ నెక్స్ట్**

జిల్లాలోని 12 మండలాలు రెండు మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, యువ వికాసం వంటి పథకాలకు సంబంధించి 1,92,617 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో లబ్ధిదారులు ఎక్కువగా రూ.500 సిలిండర్‌కు, తరువాత 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.49 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా 46 వేల 896 సిలిండర్‌ను వినియోగిస్తున్నారు. రూ.500కు సిలిండర్ ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు రూ.2.21 కోట్లు ఆదా అవుతుంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1100 వరకు ఉండగా దీనిపై సబ్సిడీ కూడా ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో జిల్లాలో గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించి అత్యధికంగా 1.65 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత కరెంట్ బిల్లుల మోత భరించలేక అవస్థ పడుతున్న వినియోగదారులు గృహ జ్యోతి పథకానికి ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. సిరిసిల్ల సెస్ పరిధిలో 2.64 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా గృహ అవసరాలకు సంబంధించి 1.64లక్షల కనెక్షన్లు ఉన్నాయి. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌కు సంబంధించి 1.42 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 1,34,725 మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం రూ.132.50 కోట్ల మేరకు రైతు బంధు సాయం ప్రతీ సీజన్‌లో అందుకుంటున్నారు. ప్రస్తుతం ఒక ఎకరానికి రూ.10 వేలు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రైతు భరోసా పేరుతో రూ.15 వేలకు అందించనున్నారు. రైతు భరోసాకు సంబంధించి కొత్తగా రైతులు 69,723 మంది దరఖాస్తు చేసుకోగా కౌలు రైతులు 5642 మంది, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఆర్థిక సాయం ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో 76,953 మంది దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ పథకానికి పోటీ పడి దరఖాస్తులు సమర్పించారు. మహాలక్ష్మీ పథకంలో 18 ఏళ్లు దాటిన మహిళలకు రూ.2500 చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన మహిళలు 2 లక్షల మంది వరకు ఉన్నారు. ఈ పథకానికి 1.28 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో పింఛన్‌దారులు 1.19 లక్షల మంది ఉన్నారు. వీరి పింఛన్‌ను రూ.4 వేలకు పెంచనున్నారు. తాజాగా పింఛన్ కోసం 71,677 మంది, దివ్యాంగుల పింఛన్ కోసం 4824 మంది దరఖాస్తులు సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కూడా దరఖాస్తులు వెల్లువెత్తాయి. పథకానికి 11,098 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో మృతిచెందిన వారి కుటుంబాలు 338, ఉద్యమంలో పనిచేసిన వారు 2130 మంది 250 గజాల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు యువ వికాసం కోసం విద్యా భరోసా, వంటి పథకాలకు దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. మళ్లీ సర్వేద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఆరు గ్యారంటీల పథకాలతోపాటు తెల్ల కాగితాలపై రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై మాత్రం ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

**మండలాల వారీగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

| మండలం | దరఖాస్తులు |
|---|---|
| బోయినపల్లి | 12,808 |
| చందుర్తి | 11,737 |
| ఇల్లంతకుంట | 16,598 |
| గంభీరావుపేట | 15,567 |
| కోనరావుపేట | 14,802 |
| ముస్తాబాద్ | 16,127 |
| రుద్రంగి | 5404 |
| తంగళ్లపల్లి | 16,766 |
| వీర్నపల్లి | 4741 |
| వేములవాడ | 7854 |
| వేములవాడ రూరల్ | 8050 |
| ఎల్లారెడ్డిపేట | 17,030 |
| సిరిసిల్ల మున్సిపాలిటీ | 30,146 |
| వేములవాడ మున్సిపాలిటీ | 14,987 |
| మొత్తం | 1,92,617 |

**ఆరు గ్యారెంటీలకు వచ్చిన దరఖాస్తులు**

| | |
|---|---|
| మహాలక్ష్మీ (రూ.2500) | 1,28,549 |
| మహాలక్ష్మీ (గ్యాస్ సిలిండర్) | 1,65,278 |
| రైతు భరోసా రైతులు (రూ.15 వేలు) | 69,723 |
| కౌలు రైతులు | 5642 |
| వ్యవసాయ కూలీలు (రూ.12 వేలు) | 76953 |
| అమరవీరులకు ఇంటి స్థలం | 338 |
| ఉద్యమకారులకు | 2130 |
| ఉచిత విద్యుత్ | 1,42,966 |
| దివ్యాంగుల పింఛన్లు | 4824 |
| ఇతర పింఛన్లు | 71,677 |
| ఇందిరమ్మ ఇళ్లు | 1,10,198 |

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జనవరి 20 : ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో పురగిరి క్షత్రియ సంఘంలో 96 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లాగా ముందుకు తీసుకెళ్తామన్నారు. పేదల సంక్షేమం కోసమే, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయడం కోసం కల్యాణ లక్ష్మి పథకం ఉందన్నారు. అభివృద్ధి విషయంలో అపోహలు పెట్టుకోవద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్దామన్నారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన చందుర్తి మండలాన్ని ఎన్నటికీ మరవనన్నారు. గతంలో మాదిరిగానే అందరి మధ్య ఒకడిలా ఉంటానన్నారు. చందుర్తి, మోత్కురావుపేట రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. చందుర్తి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ భైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, ముసుకు ముకుంద రెడ్డి, బొజ్జ మల్లేశం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలపై అఘాయిత్యాలను నివారించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జనవరి 20: మహిళలపై అఘాయిత్యాలను నివారించాలని సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ చీకోట సంతోష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ మురళీధర్‌రావు, ప్రొఫెసర్స్, వైద్యులు పాల్గొన్నారు.

● పట్టణంలోని కల్యాణ లక్ష్మీగార్డెన్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం చంద్రకళచక్రపాణి, కౌన్సిలర్లు నీరజ పూర్ణచందర్, కీర్తి కమలాకర్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావం ఉట్టిపడేలా ముగ్గులు

తంగళ్లపల్లి జనవరి 20: ముగ్గుల రూపంలో మహిళలు, చిన్నారులు సామాజిక, భక్తిభావాన్ని కళ్లకు కట్టారని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కొనియాడారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో ముగ్గులను పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ సామాజిక స్పృహ, భక్తి భావం ఉట్టిపడేలా ముగ్గులు వేసిన చిన్నారులను, మహిళలను అభినందించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ముగ్గు రూపంలో వేసిన చిన్నారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత కాంగ్రెస్ హయాంలో 4వేల ఇందిరమ్మ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పూర్మాణి మంజులలింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, అకునూరి బాలరాజు, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, జాల్గం ప్రవీణ్, కాముని వనిత, హారికరెడ్డి, గడ్డం మధుకర్, మునిగెల రాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు



బిస్కెట్‌లను అందజేస్తున్న చైర్‌పర్సన్

సిరిసిల్ల రూరల్, జనవరి 20 : పదోతరగతి అనేది విద్యార్థులకు తొలిమెట్టని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో నిర్వహించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ కల్లూరిరాజు సొంత ఖర్చులతో పదోతరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గోరుముద్ద కార్యక్రమాన్ని డీఈవో రమేష్‌కుమార్, వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు, చైర్‌పర్సన్ కళాచక్రపాణి ప్రారంభించారు. విద్యార్థుల కోసం తయారుచేసిన మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షలంటే భయపడవద్దని, లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. పది పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులను సాధించాలన్నారు. ఉన్నత చదువుల కోసం ముందుకు సాగాలన్నారు. నేటి విద్యార్థులు అత్యధికంగా సెల్‌ఫోన్‌లకు అలవాటు పడిచదువుపై అశ్రద్ధ చేస్తున్నారని ఈవిషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి పిల్లలకు సెల్‌ఫోన్‌లను ఇవ్వకుండా చదువుకునే చూడాలని కోరారు. వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటా ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అదే పరంపరను కొనసాగిస్తూ రాబోయే పదో తరగతి పరీక్షల ఫలితాలలో విద్యార్థులు ఉత్తీర్ణతలను సాధించాలని కోరారు. ప్రతీ సంవత్సరం ఉత్తమ ఫలితాలను కనబర్చి 10 జీపీఎలను సాధించిన విద్యార్థులకు సిల్వర్ మెడల్‌లతోపాటు ట్యాబ్‌లను కల్లూరి రాజు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కౌన్సిలర్ రాజు గోరుముద్దను ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. కేడీసీసీబ్యాంక్ పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు వీరబత్తిని కమలాకర్, ఎంఈవో దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యం గడువులోగా పంపాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 20: సీఎంఆర్ బియ్యాన్ని ఈ నెల 31లోగా కస్టమ్ మిల్లింగ్ పూర్తి చేసి సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్‌మిల్లర్లను అదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో రైస్‌మిల్లుల్లో శనివారం పౌరసరఫరాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఎస్‌ఎస్‌ఐకు రైస్‌మిల్లర్లు అందించాల్సిన బియ్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోనరావుపేట: రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందజేయనున్న టార్గెట్‌ను సరైన సమయంలో రైస్‌ను అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. మండలంలోని రైస్ మిల్లర్లను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. రైస్ మిల్లర్ల యజమానులు ఇవ్వాల్సిన రైస్‌ను సకాలంలో అందించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డీటీ సత్యనారాయణ ఉన్నారు.

### దుకాణాలపై ఆకస్మిక దాడులు

ముస్తాబాద్, జనవరి 20 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని పలు దుకణాలపై తూనికలు కొలతల అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అధికారుల ఆకస్మిక దాడులతో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలు దుకాణాలను ముందస్తుగా బంద్ చేశారు. స్థానికంగా ఉన్న షాపులు నాలుగు గంటలకు పైగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదానిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ

గంభీరావుపేట, జనవరి 20 : గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం సీఐ శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మీకోసం కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ఇటీవల ప్రజలకు అవగాహనకల్పించారు. దీంతో గ్రామస్థులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందు కొచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు అభినందనీయమన్నారు.

## త్వరలోనే మర్రిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**




మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 20 : త్వరలోనే మర్రిపల్లి రిజర్వాయర్ పనులను ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మర్రిపల్లి, మల్లారం గ్రామాలలో శనివారం నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మర్రిపల్లి రిజర్వాయర్ పూర్తతే చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తొలగిపోతుందన్నారు. మర్రిపల్లి ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పేరిట రూ.6లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత గత ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా చేసిన అప్పులకు మున్సిపాలిటీలకు కరెంటు బిల్లు కట్టలేని దుస్థితి తెచ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు.

● చెక్కపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిర్మించిన గోదామును జడ్పీ చైర్ పర్సన్ అరుణ, నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్, ప్యాక్స్ చైర్మన్ ఎనుగు తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడ్డిక జైపాల్ రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, జడ్పీటీసీ ఏశ వాణితిరుపతి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### గణితం అంటే భయాన్ని వీడాలి



విద్యార్థులకు బహుమతులను అందజేసిన జిల్లా విద్యాధికారి

సిరిసిల్ల రూరల్, జనవరి 20: గణిత శాస్త్రం అంటే విద్యార్థులు భయాన్ని వీడాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. తెలంగాణ గణిత ఫోరమ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభాపాటవ పోటీలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. ఆంగ్లమాధ్యమంలో ముస్తాబాద్ మండలం బందనకల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ప్రణవి ప్రథమ, ముస్తాబాద్ జిల్లా పరిషత్‌పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ ద్వితీయ, గంభీరావుపేట మండలం లింగన్న పేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన భావన తృతీయ స్థానాలను సాధించారు. తెలుగు మాధ్యమంలో ముస్తాబాద్ పాఠశాలకు చెందిన దయానంద్ ప్రథమ, వేములవాడ తిప్పాపూర్ పాఠశాలకు చెంది న సాయి ద్వితీయ, వేములవాడ పాఠశాలకు చెందిన రాజమల్లు తృతీయ స్థానాలను సాధించారు. మోడల్ స్కూల్, గురుకుల విద్యాలయాల్లో తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకులానికి చెందిన సుస్మిత, హాసిని, గంభీరావు పేట మండలం దమ్మన్నపేట మోడల్ స్కూల్‌కు చెందిన వైష్ణవి విజేతలుగా నిలవగా డీఈవో బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లచ్చయ్య టీఎంఎఫ్ అధ్యక్షుడు హన్మండ్లు ప్రధాన కార్యదర్శి బచ్చు అశోక్ పాల్గొన్నారు.

### ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జనవరి 20 : జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతగా సాగింది. కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024- 25 విద్యా సంవత్స రానికి 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షను సిరిసిల్ల పట్టణంలోని నాలుగు కేంద్రాలలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరిగిన పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని పరీక్షలను రాయగా వీటిని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి పర్యవేక్షించారు.

### ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గంభీరావుపేట, జనవరి 20: గంభీరావుపేట మండలం దమ్మన్నపేట అదర్శ పాఠశాల, కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. 7,8, 9, 10 తరగతుల్లో ఉన్న ఖాళీలకు కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 2వ తేదీలోపు 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7న పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ వెల్లడించారు.

### రేపు చెకుముకి సైన్స్ సంబరాలు

ఇల్లంతకుంట, జనవరి 20: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న సోమవారం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల బాధ్యులు మహేష్‌చంద్ర, అనీల్‌కుమార్, నిషాని మహేందర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 8,9,10 విద్యార్థులకు పాఠశాల స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు.

### రేపు మాంసం విక్రయాలు చేపట్టవద్దు

ఎల్లారెడ్డిపేట, జనవరి 20: అయోధ్యలో రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 22న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పదిర, వెంకటాపూర్, గొల్లపల్లి తదితర గ్రామాల్లో మాంసం విక్రయాలు చేపట్టవద్దని ఆయా గ్రామాల సర్పంచులు శనివారం పేర్కొన్నారు. చికెన్, మాంసం అమ్మకందారులు దుకాణాలను మూసి ఉంచాలని సూచించారు. విక్రయాలు సాగిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

### మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ రోజ

కోనరావుపేట, జనవరి 20: కోనరావుపేట మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మహిళా సాధికారతపై కోఆర్డినేటర్ రోజా శనివారం అవగాహన కల్పించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కోఆర్డినేటర్లు అంజలి దేవి, ఆదర్శ ప్రిన్సిపాల్ సాగర్ ఉన్నారు.

## కాపర్ వైర్ చోరీ

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20: సత్తక్కపల్లి గ్రామ శివారులోని వరుద కాలువ వెంట ఉన్న వ్యవసాయం పొలాల్లోని మోటర్ల నుంచి కాపర్ వైర్ చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. శనివారం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలాలకు నీరు పెట్టడానికి రైతులు వెళ్లగా మోటర్ల నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

## మొగి పురుగును నివారించాలి

శంకరపట్నం, జనవరి 20: వరి పంటకు మొగి పురుగు ఆశించకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రాచకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పీలక దశలో ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ముగిపురుగు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మొగి పురుగు ఆశించకుండా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎనిమిది కిలోలు ఒక ఎకరానికి వేసుకోవాలని చెప్పారు. చిరు పొట్ట దశలో వరిలో లిం గాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగుల ఉధృతిని గమనించాలని సూచించారు.

**చిగురుమామిడి:** రైతులు అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాదికారి కేతిరి రంజిత్ రెడ్డి ఆన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. కాండం తొలుచుపరుగ నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా రైతులు అధికారలను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపిక

చొప్పదండి, జనవరి 20: మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పిరిశెట్టి హర్షవల్లిక రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికయింది. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వర్చువల్ విజ్ఞానశాస్త్ర మేళాలో స్మార్ట్ రోటీ మేక్ యూజింగ్ సోలార్ ఎనర్జీ అనే ఎగ్జిబిట్‌ను హర్షవల్లిక ప్రదర్శించింది. ఈ ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయింది. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు బి రఘుకిశోర్, సైన్స్ ఉపాధ్యాయురాలు గట్టు శ్రీవాణితోపాటు ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


ప్రభాకర్(ఫైల్)

పాలకుర్తి, జనవరి 20: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో శుక్రవారం రాత్రి వొడ్నాల ప్రభాకర్(40) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఈనెల 11న సంక్రాంతి పండుగకు తల్లిగారింటికి దట్నూర్ వెళ్లింది. అప్పటినుంచి ప్రభాకర్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు తండ్రి వొడ్నాల కిష్టస్వామి, తల్లి కమలతో కలిసి భోజనం చేసి నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి కుమారుడి గదివైపు చూడగా ఉరేసుకొని ఆత్మహత్య కనిపించాడు. ఈ మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభాకర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె అక్షిత ఉన్నది.

### కడుపు నొప్పి భరించలేక తాపీ మేస్త్రి..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం రాత్రి జూల సతీష్(35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న సతీష్ మద్యానికి అలవాటుపడ్డాడు. నాలుగు నెలలుగా తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో కడుపునొప్పికి వైద్య పరీక్షలు చేయించుకోగా, మద్యం మానివేయాలని వైద్యులు సతీష్‌కు సూచించారు. చికిత్స తీసుకున్న తర్వాత కూడా మద్యం సేవిస్తూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. సతీష్ భార్య సుమలత సంక్రాంతి పండుగకు ఇద్దరు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్ళింది. శుక్రవారం రాత్రి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. శనివారం తెల్లవారు జామున ఇంటి ఆవరణలో షెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

### అనారోగ్యంతో వృద్ధుడు..

తిమ్మాపూర్, జనవరి 20: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఓ వృద్ధుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన దండు మల్లయ్య (90) భార్య చాలా రోజుల క్రితం మృతి చెందింది. దీంతో మల్లయ్య తన పెద్ద కూతురి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల దండు మల్లయ్య కాలుకు ఇన్ఫెక్షన్ వచ్చింది. దీంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రిలో ఆపరేషన్ చేయించారు. పూర్తి స్థాయిలో నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు నమోదు

ఓదెల, జనవరి 20 : మండలంలోని ఇందుర్తికి చెందిన కంకణాల పవన్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. పొత్కపల్లి విద్యుత్ ఏఈ రాజమల్లు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆటంకం కల్పించి, దౌర్జన్యం చేశాడని ఏఈ ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

వీర్నపల్లి, జనవరి 20: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుటుంబ పోషణ భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన జక్కుల లింబాద్రి(36) అనే దివ్యాంగుడు కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణ భారమై ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లింబాద్రికి భార్య సరిత, ముగ్గురు కూతుర్లు రుత్విక(7), నిహారిక(5), సాన్విక(3) ఉన్నారు.

## గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 20: బీసీ స్టడీసర్కిల్‌లో గ్రూప్స్-1,2,3,4, ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5లక్షలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్‌కార్డ్, ఫొటోలను ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్‌నంబర్ 0878-2268686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనం, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## రేపు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 17 బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జిల్లాల క్రీడాకారులు పాల్గొనుటకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత పారంతో స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ గత సంవత్సర మార్కుల జాబితాతో హాజరు కావాలని సూచించారు.

## మాజీ మంత్రి ఆవిష్కరించిన శిలాఫలకం తొలగింపు


శిలాఫలకం తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మల్యాల, జనవరి 20: గతేడాది క్రితం అప్పటి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించిన శిలాఫలకాన్ని మల్యాల గ్రామ పంచాయితీ సిబ్బంది తొలగించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.2 కోట్లతో మల్యాల-పెగడపల్లి డబుల్‌రోడ్డు పనులు చేపట్టగా గత ఫిబ్రవరి 25న మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద శిలాఫలకాన్ని అప్పటి మంత్రి ఈశ్వర్ ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. తాజాగా దాన్ని కూల్చివేయడం విమర్శలకు దారి తీసింది.

## అసంపూర్తిగా రోడ్డు పనులు


మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య పూర్తి కాని రోడ్డు

మానకొండూర్, జనవరి 20: మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు చేపట్టిన రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం రూ. 70కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. కాగా మండలంలోని మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు పనులు నిలిచిపోయాయి. దీంతో పాటు ఆయా గ్రామాలలో డ్రేనేజీల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. మానకొండూర్ నుంచి పచ్చునూర్ వరకు 16కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ పరిధిలో 8 కల్వర్టులు, రోడ్డు డ్యాంల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. తారురోడ్డు లేని ప్రదేశంలో బస్సులు, లారీలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. దీంతో వెనుక వచ్చే ద్విచక్రవాహనదారులు కళ్లల్లో దుమ్ము పడుతుండ డంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## శ్రీరాముడి దర్శనానికి

# మూడు ప్రత్యేక రైళ్లు

- సికింద్రాబాద్, కాజీపేట, జాల్నా నుంచి అయోధ్యకు..
- ఈనెలాఖరు నుంచి ప్రారంభం
- త్వరలో రిజర్వేషన్ల ప్రక్రియ
- పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ స్టేషన్లలో హాల్టింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)



అయోధ్యలోని రామాలయంలో ఈనెల 22న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం రామభక్తులు అయోధ్యను సందర్శించేందుకు వీలుగా దక్షిణ మధ్య రైల్వే నెల రోజుల పాటు మూడు ప్రత్యేక రైళ్లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా నడపనున్నది. సికింద్రాబాద్, కాజీపే ట, మహారాష్ట్ర జాల్నా నుంచి రైళ్లను నడపనున్నది. సికింద్రా బాద్, కాజేపట నుంచి నడిచే రైళ్లు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వే స్టేషన్లలో ఆగనుండగా, జాల్నా నుంచి వచ్చే రైలు కరీంనగర్ స్టేషన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకునే ప్రక్రియ ప్రారంభం కానున్నది. నెలరోజుల పాటు నడవనున్న ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా అయోధ్య రామ మందిరానికి వెళ్లి ఆ జగదబి రాముడ్ని దర్శించుకునే అవకాశాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కల్పించారు. ఈ రైళ్లు నెల రోజుల పాటే నడుస్తాయా, ఆ తర్వాత కొనసాగిస్తారా అనే విషయం తెలియదు. మూడు ప్రత్యేక రైళ్లు దాదాపుగా ఒకే సమయంలో ప్రారం భంకానున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లను నడిపించడం వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు అయోధ్యకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉండనున్నది.

### ● సికింద్రాబాద్ నుంచి..

రైలు నంబరు 07221 సికింద్రాబాద్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 29వ తేదీ నుంచి వచ్చేనెల 29వ తేదీ వరకు నడవనున్నది. జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 6:20 నిమిషాలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. మరుసటి రోజంతా ప్రయాణించి ఆ తర్వాత తెల్లవారు జామున 3:30 గంటలకు అయోధ్య జంక్షన్‌కు చేరుకుంటుంది. ఒకటిన్నర రోజు ఈ రైలు నడవనున్నది. ఈ ప్రత్యేక రైలు నంబరు 07222 అయోధ్య ధాం రైల్వే జంక్షన్ నుంచి సికింద్రాబాద్ జంక్షన్‌కు దిగువ మార్గంలో ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో, మార్చి 1, 3 తేదీల్లో ఈ రైళ్లు నడవనున్నాయి. అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌కు చేరుకోనున్నది. అయోధ్య నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు రాత్రి 8:08 గంటలకు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

### ● కాజీపేట నుంచి..

రైలు నంబరు 07223 కాజేపేట జంక్షన్ నుంచి అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 28వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడవనున్నది. వారంలో మూడు రోజులు మొత్తం 15 ట్రిప్పులు ఈ రైలు నడుస్తుంది. జనవరి 30వ తేదీ ఆరంభమయ్యే ఈ రైలు ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీలలో కాజీపేట నుంచి సాయంత్రం 6:20 గంటలకు బయలుదేరనున్నది. పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షన్‌కు చేరుకోనున్నది. ఇదే రైలు నంబరు 07224 దిగువ మార్గంలో ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2వ తేదీల్లో ఈ ప్రత్యేక రైలు నడవనున్నది. అయోధ్య నుంచి మధ్యాహ్న 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు రానున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

### ● జాల్నా మీదుగా..

రైలు నంబరు 07649 మహారాష్ట్రలోని జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు వయా పర్భని, పూర్ణా, నాందేడ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, బల్లార్షా మీదుగా ఎగువ మార్గంలో నడవనున్నది. ఈ రైలు వచ్చేనెల 4వ తేదీన ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి బాసర రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు సాయంత్రం 4 గంటలకు, కోరుట్లకు 5:18 గంటలకు, లింగంపేట్ జగిత్యాలకు 5:50 గంటలకు, కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 6:45 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:35 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు చేరుకోనున్నది. అక్కడి నుంచి ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షనుకు చేరుకున్నది.

దిగువ మార్గంలో రైలు సంఖ్య 07650 అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నాకు ఫిబ్రవరి 6వ తేదీన మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి ఒక రోజు ప్రయాణం తర్వాత ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు అయోధ్య ధాం నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు రాత్రి 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:55 గంటలకు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు 8:35 గంటలకు, లింగంపేట్ జగిత్యాల రైల్వే స్టేషన్‌కు రాత్రి 9:20 గంటలకు, కోరుట్ల రైల్వేస్టేషన్‌కు 9:50 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు రాత్రి 11:10 గంటలకు, బాసర రైల్వే స్టేషన్‌కు 11:53 గంటలకు చేరుకోనున్నది. ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

# ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


నరసింహుడి ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ● కొనసాగుతున్న వేద పారాయణం, హవనం

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు మూడవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా మూడో రోజు వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## బుగ్గారం గ్రామ సర్పంచ్ సస్పెన్షన్

బుగ్గారం జనవరి 20: బుగ్గారం గ్రామ సర్పంచ్ సుమలతను సస్పెండ్ చేస్తు జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం గ్రామానికి చెందిన చుక్క గంగారెడ్డి బుగ్గారం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని పలు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సూచనల మేరకు విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని నిర్ధారణ కావడంతో సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజు తెలిపారు.

## 'నవోదయ' ప్రవేశ పరీక్ష ప్రశాంతం

చొప్పదండి, జనవరి 20: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జాతీయస్థాయిలో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 7,105 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 73 శాతం మేరకు 5,226 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. 1,879 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఎలాంటి సంఘ టనలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆమె తెలిపారు.

## కొండగట్టులో బారులు తీరిన భక్తులు


క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

మల్యాల, జనవరి 20: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, జనవరి 20: గంగాధర మండలం ఇస్లాంపూర్‌లో శుక్రవారం అర్ధరా త్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్(ఏపీ36వై1621)ను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. గ్రామంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


గుండిలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ

రామడుగు, జనవరి 20: విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో చదవాలని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో న్యాయవాది గుమ్మడి ప్రశాంత్, అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలంటే తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మార్గాలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. సామాజిక మాధ్యమాల కు దూరంగా ఉండాలని చెప్పారు. వాటి వల్ల జీవితంలో విలువైన సమయం వృథా అయిపోతుందని అన్నారు. గృహహింస, వరకట్నం, ఆన్‌లైన్ నేరాలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆడపిల్లలు సామాజిక మాధ్య మాల్లో ఫొటోలు, వీడియోలను పెట్టకూడదని, ఏదైనా సమస్యలు వస్తే పోలీసులను వెంటనే సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ లకు బానిస కాకుండా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన అన్ని పాఠశాలల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్, చొప్పదండి సీఐజి రవిందర్, ఎస్ఐ నేరెళ్ళ రమేష్, అక్షర కరస్పాండెంట్ మునిందర్, సర్పంచ్ మానస ప్రవీణ్, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెలుగుల సంస్థకు బకాయిల చీకట్లు

- సిరిసిల్ల సెస్‌కు రూ.714.57 కోట్లు పెండింగ్
- ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు రూ. 624.92 కోట్లు
- పవర్‌లూం విద్యుత్ సబ్సిడీ బకాయి రూ. 82.22 కోట్లు


సెస్ ప్రధాన కార్యాలయం

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో దేశంలోనే అగ్రగామిగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగానే తయారైంది. గత ప్రభుత్వ హయాం నుంచి బీఆర్ఎస్ అధికార పార్టీకి చెందిన వారే పాలకవర్గంగా ఉన్నారు. దీంతో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరాల సంఘం (సెస్)కు రావాల్సిన బకాయిలు, సెస్ చెల్లించాల్సిన బకాయిలపై చర్చ లేకుండానే సాగిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో విద్యుత్ బకాయిల చర్చ ముందుకు వచ్చింది. సెస్ చెల్లించాల్సిన బకాయిలుపై విద్యుత్ సంస్థలు ఒత్తిడి పెంచడంతో సెస్ అధికారులు, పాలకవర్గం బకాయిల వసూలుపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో సెస్ పరిధిలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను గురువారం తొలగించారు. అధికారుల హామీకత్తుతో మళ్లీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలకు కొత్త ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందా? అని వినియోగదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### ● 420 సర్వీసులతో..

జిల్లాలో చీకట్లను పారదోలి వెలుగులు నింపడానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 2 లక్షల 70 వేల 545 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 1,67,984, వాణిజ్య కనెక్షన్లు 16,974 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1394, పవర్‌లూం కనెక్షన్లు 5635, వ్యవసాయ కనెక్షన్లు 74,391, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3118, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లతో విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ.714.57 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దాదాపు రూ.624.92 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.47.07 కోట్లు, దీనికి సర్ చార్జ్‌గా రూ.36.14 కోట్లుతో కలిసి రూ.83.22 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించి నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి గత సంవత్సరం మార్చి 31 వరకు రూ.174.04 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో ఉంచి పల్లె ప్రగతి, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ప్రస్తుతం 2020 ఆగస్టు నుంచి 2023 నవంబరు వరకు రూ.16.76 కోట్లు మళ్లీ పేరకుపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, 1049 ఉండగా వీటికి సంబంధించి రూ.3.64 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయి. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.77.81 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నా వ్యవసాయ దారుల నుంచి సర్వీస్ రుసుము నుంచి రావాల్సిన బకాయిలు రూ.8.42 కోట్లు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ.28.76 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ. 9.98 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.8.68 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ.1.54 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.18.81 కోట్లు బాకీలు ఉన్నాయి. దీంతోపాటు పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.21 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి, వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి కొనసాగుతున్న క్రమంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

## 21 మంది మందుబాబులకు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం , జనవరి 20 : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మందికి జైలు శిక్షతోపాటు జరిమానా, మరో 29 మందికి ఒక్కొక్కరికి. రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారు. రెండు నెలల్లో సిరిసిల్ల పట్టణ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 50 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరికి సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రఘుపతి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరికీ మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ 3 వేల జరిమానా, ఏడుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కక్కరికి రూ 3వేల రూపాయల జరిమానా విధించారు. మరో 12 మందికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ 3వేల జరిమానా, ఇంకో 29 మందికి ఒక్కొక్కరికి రూ 3వేల చొప్పున జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడి న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కులం పేరుతో దూషించిన ఒకరి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 20: కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి శనివారం తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం నూకలమర్రి గ్రామానికి చెందిన ముడారపు చంద్రయ్య పొలంలో అదే గ్రామానికి చెందిన లిక్కిడి దేవయ్య అనే వ్యక్తికి సంబంధించిన పశువులు మేత మేసాయి. పశువులు మేత మేస్తే తన పంటకు నష్టం జరుగుతందని దేవయ్యను అడుగగా కులంపేరుతో తనను దూషించి కర్రతో దాడి చేసాడని ముడారుపు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు విచారణ జరిపి లిక్కిడి దేవయ్యపై అట్రాసిటీ కేసునమోదు చేశామని చెప్పారు. ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

## ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని రెయిన్‌బో ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థులు పోషకాలతో కూడిన పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా రవాణా శాఖ అధికారి కొండల్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ, గడ్డం చందన, సీఐ రఘుపతి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, గుండపల్లి పూర్ణచందర్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్

తంగళ్లపల్లి, జనవరి 20: సర్దాపూర్ 17వ బెటాలియన్‌కు చెందిన సీ కంపెనీ, అధికారులు అన్యువల్ రిఫ్రెష్ కోర్సులో భాగంగా శనివారం తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు, లగిశెట్టి విశ్వనాథం స్మారక వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు సూచనల మేరకు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేసినట్లు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పార్థ సారధిరెడ్డి తెలిపారు. ఆర్ఐలు శ్రీనివాస్, నేమాజి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ఇల్లంతకుంట, జనవరి 20: అయోధ్యలోని రామమందిరంలో ఈ నెల 22న బాలరామ ప్రతిష్ఠాపన నేపథ్యంలో మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ విద్యార్థులు శ్రీరామ నామ ఆకృతిలో ఆకట్టుకున్నారు. శ్రీరామ అక్షింతల వితరణ ఇంటింటికి జరుగుతున్న కార్యక్రమానికి తోడుగా విద్యార్థులు భక్తిభావాన్ని ప్రదర్శించడం పట్ల పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధితోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 20 :సిరిసిల్ల పట్టణంలోని పలు ఆలయాలను శనివారం భారతీయ జనతాపార్టీ నాయకులు శుభ్రం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గాంధీనగర్‌లోని విశ్వనాథస్వామి శివాలయంతోపాటు సుందరయ్యనగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని శుభ్రం చేశారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి చెన్నమనేని కమలాకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు మ్యాన రాంప్రసాద్, రాయిని పతాప్, ప్రకాష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

తంగళ్లపల్లి, జనవరి 20: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నాయకులు జల్గం ప్రవీణ్, వైద్య శివప్రసాద్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మండాటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

సిరిసిల్ల టౌన్, జనవరి 20: సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు భీమవరం శ్రీనివాస్ తన అనుచరవర్గంతో శనివారం సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలను చైతన్యం చేస్తున్నాం

తంగళ్లపల్లి, జనవరి 20: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో సీపీఐ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా నాయకులు సోమ నాగరాజు, బాచుపల్లి శంకర్, బాలరాజ్, శ్రీనివాస్, మల్లయ్య, రాజశేఖర్, చంద్రం, బాలనర్సు, రాజేందర్, కొమురయ్య మల్లయ్య పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై ఇసుక స్మగ్లర్ల దాడి

ముస్తాబాద్, జనవరి 20: మండలంలోని తుర్కపెల్లెలో జర్నలిస్టు ఇంటిపై ఇసుక స్మగ్లర్లు దాడికి పాల్పడ్డారు. ఓ పత్రికలో సిరిసిల్ల జిల్లా స్టాఫర్‌గా పని చేస్తున్న కర్రోల్ల రాజు శనివారం వివరాలు వెల్లడించారు. మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తే పోలీసులకు సమాచారం అందిస్తూ ట్రాక్టర్‌ను పట్టుబట్టిస్తున్నారని తన ఇంటికి వచ్చి దుర్భాషలాడారన్నారు. కులం పేరుతో దూషించారని, గండిలచ్చపేటకు చెందిన దాదాపు 50 మంది ఇంటిపైకి వచ్చారని తెలిపారు. చంపుతామని బెదిరించారని, న్యాయం చేయాలని పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి జనవరి 20: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న తర్వాత మొబైల్‌కు అయోధ్య రామాలయం సంబంధించిన లైవ్ స్ట్రీమింగ్ లేదా లైవ్ ఫొటోస్ సంబంధించిన లింక్‌లు వచ్చే అవకాశం ఉన్నదని, వాటిని ఓపెన్ చేయవద్దని అన్నారు. లింక్‌లను సైబర్ క్రిమినల్స్ క్రియేట్ చేశారని, లింక్స్ ఓపెన్ చేస్తే మన మొబైల్ హ్యాక్ చేస్తారని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిపై దాడి

బోయినపల్లి, జనవరి 20:బోయినపల్లి మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. మానువాడలో ఇరువర్గాల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. మరో వర్గం గోవర్ధన్ గౌడ్‌ను దూషిస్తూ దాడి చేసింది. విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ బాధితుడిని పరామర్శించారు. నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## డిగ్రీ విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

రుద్రంగి, జనవరి 20: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పిసరి భూమానందం నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గతంలో మృతుడు భూమానందం కుటుంబాన్ని ఆది శ్రీనివాస్ పరామర్శించారు. భూమానందం కూతురు వైష్ణవి చదువుకయ్యే ఖర్చు అందజేస్తానని హామీ ఇచ్చారు. హామీ ప్రకారం డిగ్రీ చదువు కోసం అయ్యే ఫీజు రూ.18వేలను రుద్రంగి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వెంకటేశం, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఇల్లంతకుంట, జనవరి 20: మండలంలోని గొల్లపల్లికి చెందిన ఓర్సుల నర్సయ్యను మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం పరామర్శించారు. నర్సయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన సోషల్‌మీడియా కన్వీనర్ గొల్లపల్లి రాములు జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, నాయకులు వెంకటరెడ్డి, ఎంధ్ర చందన్, పత్రి అంజయ్య, రామస్వామి, రాములు, ప్రవీణ్, కనుకయ్య, తిరుపతి, లక్ష్మన్, రాములు పాల్గొన్నారు.

# అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గౌతమి

కోనరావుపేట, జనవరి 20 : అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కోనరావుపేట మండలం కమ్మరిపేట తండా, నిజామాబాద్, రామన్నపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలోని వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య ఎంత కొత్తగా ఎంతమంది డబుల్ గా నమోదైన ఓట్ల తొలగింపు తదిత అంశాలను కలెక్టర్ బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనవరి ఒకటో తేదీ 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటర్ నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట కోనరావుపేట తహసీల్దార్ విజయ రామారావు ఉన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** తప్పులు దొర్లకుండా ఓటరు నమోదు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ గౌతమి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, తిమ్మాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, గుండారం, అల్మాస్‌పూర్, కోరుట్లపేట గ్రామాల్లో బీఎల్‌వోలు నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. వెంకటాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదును అడిషనల్ కలెక్టర్ గౌతమి పరిశీలించారు. నమోదు ప్రక్రియ వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, నూతనంగా నమోదు చేసిన ఓటర్లు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపుపై ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన వారి వివరాలను నమోదు చేసి ఓటు హక్కు కల్పించేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రాంచందర్ ఉన్నారు.

**గంభీరావుపేట:** జనవరి 1 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ భూపతి సూచించారు. గంభీరావుపేట మండలంలో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం తహసీల్దార్ భూపతి పరిశీలించారు. లింగన్నపేట, సముద్రలింగాపూర్, గజ సింగవరం గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. 18 ఏళ్లవారు తప్పి పోకుండా ఓటరు నమోదు చేసుకునే విధంగా చూడాలని సూచించారు. ఫారం 6 లో 129 మంది, ఫారం 7లో ఆరుగురు, ఫారం 8లో 91 మంది నమోదు చేసుకున్నారు.

## కళాకారుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 20: జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ శనివారం వేములవాడలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళా సంస్థల వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, గౌరవ అధ్యక్షుడు బొద్దు రాములు, అధ్యక్షుడు సావనపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, మానువాడ లక్ష్మీనారాయణ, గుమ్మడి రాజేశం, సోమినేని బాలు, వెంపటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న వేములవాడ ఆర్డీవో మధుసూదన్

వేములవాడ, జనవరి 20 : అనాథ పిల్లలను, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని వేములవాడ ఆర్డీవో మధుసూదన్ అన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం పరిసరాల్లో అనాథ పిల్లలు, పారిపోయిన పిల్లలు, పని చేసే పిల్లలను గుర్తించాలని, వారికి రక్షణ కల్పించాలని, పాఠశాలలో చేర్పించాలని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ వృద్ధులు భిక్షాటన చేయకుండా చూడాలని, ఒంటరి మహిళలు, వృద్ధులను ఎల్లారెడ్డిపేట, మండెపల్లిలోని వృద్ధాశ్రమంలో చేర్పించాలని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పున్నమి చందర్, కాజా పాషా, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్, సీడీపీవో ఎల్లయ్య, ఏసీ డీపీవో సుచరిత, ఎల్‌వో రఫీ, దేవస్థానం ఈఈ రాజేష్, డీఈ రఘునందన్ ఏఈవోలు హరికృష్ణ, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్, ఆలయ పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, సిరిగిరి శ్రీరాములు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల కరకట్ట నిర్మాణంలో శాస్త్రీయ, సాంకేతిక లోపం



కరకట్టను పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 20: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల పట్టణంలోని మానేరు వంతెన నుంచి నిర్మించిన కరకట్టలో శాస్త్రీయ, సాంకేతిక లోపాలున్నాయని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం మానేరు వంతెన నుండి నిర్మించిన కరకట్టను కేకే మహేందర్‌రెడ్డి రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల మానేరు వంతెన నుంచి నిర్మించిన కరకట్టలో శాస్త్రీయ లోపాలుండడంతో ఈ ప్రాంత రైతులు నష్టపోతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రైతులకు సాగు నీరు అందించాలన్న సంకల్పంతో మిడ్ మానేరుకు శంకుస్థాపన చేశారన్నారు. సిరిసిల్ల కరకట్ట నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించక పోవడంతో కరకట్ట కింద ఉన్న వ్యవసాయ భూముల్లోకి వర్షాకాలం రాగానే వరద నీరు చేరడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కరకట్టకు శాస్వత మరమతు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వం దీనిపై దృష్టి పెడుతోందన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన వారందరికీ నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వరద నీరు, మురికినీరు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, వెంకటేశం, సామల దేవదాస్, వెల్ముల తిరుపతిరెడ్డి, కంసాల మల్లేశం, కాముని నళినీకాంత్ పాల్గొన్నారు.

## సెస్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్



చెక్కు అందజేస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

ముస్తాబాద్, జనవరి 20: సెస్ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. పోతుగల్‌లో రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో జంగం శ్రీనివాస్ మరణించగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం సెస్ చైర్మన్ మాట్లాడుతూ సెస్ పరిధిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రతీ గ్రామంలో సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, విండో చైర్మన్ బాపురావు, సర్పంచ్ ద్యావతి పండరి, ఏడీ మహేందర్, ఏఈ విష్ణుతేజ, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వీర్నపల్లి, జనవరి 20 : విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరుణ్ కుమార్ తెలిపారు. వీర్నపల్లి మండలం అంబేడ్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. టీచర్ బోధనపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు విద్యార్థులు పోటీ పడి విజయం సాధించేలా విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వకుళ, ఎస్ఎంసీ చైర్మన్ మల్లారపు జోసెఫ్, ఉపాధ్యాయిని నాగమణి, విద్యార్థులు, తల్లిదండ్రులు శంకర్, అశోక్, దేవరాజు, నాంపల్లి, అనిల్, సుజాత, కాంతయ్య, తోట రాజు తదితరులు ఉన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో చోరీ

ముస్తాబాద్, జనవరి 20 : మండలంలోని మద్దికుంట గ్రామంలో గల పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉన్న పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి దాటాక దొంగలు పడి అమ్మవారిపై ఉన్న ఆభరణాలు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా వరుసగా జరుగుతున్న చోరీలపై మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇల్లంతకుంట, జనవరి 20: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. ఇల్లంతకుంట నుంచి ఆటోలో టేకుమట్ల కుమార్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాత్రి దాడి చేసి 10 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కుమార్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కోనరావుపేట, జనవరి 20 : మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పూరేల్లి రవీందర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. బదిలీపై నూకలమర్రికి వెళ్లారు.

## వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కేటీఆరే కారణం




మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్

తంగళ్లపల్లి, జనవరి 20: వస్త్ర పరిశ్రమలో అవకతవకల్లో కేటీఆర్‌కు సైతం ముడుపులు ముట్టాయని, వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కేటీఆరే కారణమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆరోపించారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేత కార్మికుల నుంచి సైతం కమీషన్లు దండుకోవడానికి కొత్త పథకాలు సృష్టించారని, మ్యాక్స్ సొసైటీలను అడ్డం పెట్టుకొని వందల కోట్లు దోచుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.275 కోట్ల బకాయిలు ఎందుకు విడుదల చేయాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నేతన్నల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో యుద్ధం చేస్తాం, హామీలు అమలు చేయిస్తామని కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. వస్త్ర పరిశ్రమ బందువవడానికి కారణం మీరు కాదా? అని ప్రశ్నించారు. బడాసేట్లతో కలిసి బతకమ్మ చీరల్లో వంద కోట్ల దోపిడీ జరిగిందని అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మోర లక్ష్మిరాజం, సామాల గణేశ్, మోర రాజు, ఎంపీటీసీ భైరినేని రాము, మునిగెల రాజు, చుక్క శేఖర్, ఆరెపల్లి బాలు, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఇక్బాల్, ఎగుర్ల ప్రశాంత్, ముక్క శ్రీనివాస్, చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు

రాయికల్, జనవరి 20: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని కుర్మపల్లి, ఒడ్డెలింగా పూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్‌లతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతి పేదవా రికి దరి చేరుతుందని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతామని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీసీ సంధ్యారాణిసురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచులు మ్యాకల సుమలత, పాలకుర్తి రవి, ఎంపీటీసీలు మోర విజయలక్ష్మి, వెంకటేష్, స్వప్న, ఉప సర్పంచులు పుల్ల మల్లేశం, సాయిలు, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మండల కో ఆప్షన్ సభ్యుడు ముఖీద్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

●మొదటిసారి రాయికల్ పట్టణానికి వచ్చిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్సీ టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తంగళ్లపల్లి ఎంపీవోగా ఆరీఫ్

తంగళ్లపల్లి, జనవరి 20:తంగళ్లపల్లి మండల పంచాయతీ రాజ్ అధికారిగా ఆరీఫ్‌ను నియమిస్తూ డీపీవో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముస్తాబాద్ ఎంపీవోగా కొనసాగుతున్న ఆరీఫ్‌కు తంగళ్లపల్లి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీవోగా కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌ను విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆరీఫ్ విధుల్లో చేరకుండా లాంగ్‌లీవ్ పెట్టుకున్నట్లు సమాచారం.

**తంగళ్లపల్లికి శాపంగా ఎంపీవో పోస్టు**

తంగళ్లపల్లి మండలానికి ఎంపీవో పోస్టు అందని ద్రాక్షగా మారింది. తంగళ్లపల్లి ఎంపీవో జోగం రాజును మూడు సంవత్సరాల క్రితం పలు కారణాల చేత డిప్యూటేషన్‌పై ఇల్లంతకుంటకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఆరీఫ్‌ను ముస్తాబాద్‌కు బాధ్యతలు అప్పగించారు. అప్పుడు ముస్తాబాద్‌లో పని చేసిన వెంకటేశ్వర్లును తంగళ్లపల్లికి ఎంపీవోగా డిప్యూటేషన్‌పై నియమించారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు పలు అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు. కొద్ది రోజులు ఎంపీవో లేకుండా కొనసాగిన అనంతరం మండల పరిషత్ సూపరిటెండెంట్ విజయేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. తాజాగా ముస్తాబాద్ ఎంపీవో ఆరీఫ్‌కు ఇన్‌చార్జి బాధ్యతులు అప్పగించగా రెండు మండ లాల్లో విధులు నిర్వర్తించలేనని విధుల్లో చేరకుండానే సెలవు పెట్టి వెళ్లినట్లు తెలిసింది.

**ఎంపీవోల డిప్యూటేషన్లపై దృష్టి సారించాలి**

మూడు మండలాల ఎంపీవోలు డిప్యూటేషన్లపై కొనసాగడంపై ఉన్నాతాధికారులు దృష్టి సారించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిప్యూటేషనను రద్దు చేయాలని ప్రకటించినా ఎంపీవో డిప్యూటేషన్లు ఎందుకు రద్దు చేయడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇష్టనుసారంగా ఎంపీవోల బదిలీలు, డిప్యూటేషన్లపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, జనవరి 20: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన గూడెం రాములు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించారు. ఎస్సై రమాకాంత్ బాధితుడికి శనివారం సెల్‌ఫోన్ అందజేశారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల టౌన్, జనవరి 20: సిరిసిల్ల మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సిరిసిల్ల మున్సిపల్‌లో పనిచేస్తేన్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక సార్లు సమస్యలను మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. పది రోజుల క్రితం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తామన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విన్నవించినా చైర్ పర్సన్, కమిషనర్ చర్యలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెకు పూర్తి బాధ్యత మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్, పాలకవర్గం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎదుట కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

సిరిసిల్ల టౌన్, జనవరి 20: మూడు నెలలుగా పస్తులుటున్నాం సమస్యలను పరిష్కరించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్కులు, డివైడర్లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్య దర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడారు. పట్టణంలోని పార్కులు, డివైడర్లు, ప్రధాన కూడళ్ల వద్ద శానిటేషన్, గ్రీనరి కాంట్రాక్ట్ కార్మికులపై మున్సిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్ట్‌కార్మికుల గడువు 2023 డిసెంబరు 11తో ముగిసిందన్నారు. మున్సిపల్ అధికారులు తిరిగి టెండర్లు వేయకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులు నెల రోజులుగా పనిలేక, మూడు నెలలుగా కాంట్రాక్టర్ నుంచి వేతనాలు రాక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలను పరిష్కరిం చాలని వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని, మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి ప్రశ్నించగా మున్సిపల్‌లో పని చేయడం లేదని కాంట్రాక్టర్ ఇళ్లలో పనిచేస్తున్నారని సమాధానం ఇవ్వడాన్ని సీఐటీయూ ఖండిస్తోందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ నుంచి వేతనాల బకాయిలను ఇప్పించాలని, తిరిగి ఉపాధి కల్పించాలని కోరారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులు నర్సయ్య, శారద రమణమ్మ, గీత, వసంత, మణెమ్మ, లక్ష్మి, శ్రీకాంత్, రాకేష్, వంశీ, కళ్యాణ్ పాల్గొన్నారు.